# సునీతమ్మకు 50వేల మెజారిటీ ఇవ్వండి

- గుట్టలో 100 సీట్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల
- గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్, ఐటీ, టూరిజం హబ్
- మూడుచింతలపల్లి నుంచి వడపర్తి వరకు డబుల్ రోడ్డు
- ఎన్నికల వేళ మోసపోతే గోసపడ్తం..
- కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు తప్పవు
- చీకటి మామిడి రోడ్ షోలో మంత్రి హరీశ్‌రావు

యాదగిరిగుట్ట, నవంబర్ 25 : కరువు తాండవం చేసిన ఆలేరు నియోజకవర్గాన్ని పదేండ్లలో అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపాం. ఈ ప్రాంతానికి ఎంతో చేశాం. ఇంకా ఎంతో చేయాల్సి ఉంది. రాబోయే ఐదేండ్లలో ఆలేరును అద్భుతంగా అభివృద్ధి చేస్తాం. ఇది నా హామీ అని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఇప్పటికే 80 శాతం అభివృద్ధి పూర్తయ్యింది. ఈసారి చెల్లెమ్మ సునీతను 50 వేల మెజార్టీతో గెలిపిస్తే.. ఆలేరు అభివృద్ధి బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. బొమ్మలరామారం మండలం చీకటిమామిడిలో బీఆర్‌ఎస్ ఆలేరు అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్‌తో కలిసి శనివారం రోడ్‌షోలో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇప్పటికే హామీ ఇచ్చారని, రానున్న రోజుల్లో ఆలేరును రెవెన్యూ డివిజన్ చేసుకుందామన్నారు. యాదగిరిగుట్టలో 100 సీట్ల ఎంబీబీఎస్ మెడికల్ కళాశాల నిర్మించాల్సి ఉందన్నారు. దాంతో 500 పడకల ఆస్పత్రి అందుబాటులోకి రానున్నదని తెలిపారు. ఆలేరు నియోజకవర్గానికి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్, ఐటీ, టూరిజం హబ్ నిర్మించాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ప్రభుత్వ అనుమతులు మంజూరయాయని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటుకాగానే పనులను ప్రారంభిస్తామన్నారు. ఎన్నికల వేళ మోసపోతే గోస పడతామని అన్నారు. ఎన్నికలంటే మూడు రోజుల పండుగ కాదని, ఐదేండ్ల భవిష్యత్ అని తెలిపారు. పదేండ్లలో ఆలేరు నియోజకవర్గానికి సాగుజలాలు అందించామన్నారు. కొండపోచమ్మ సాగర్ నుంచి తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాలకు సాగుజలాలు అందించినట్లు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ప్రపంచమే గర్వించేలా సీఎం కేసీఆర్ గొప్పగా పునర్నిర్మించినట్లు చెప్పారు. ఏనాడైనా ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్న సోయి కాంగ్రెసోళ్లకు వచ్చిందా? అని ప్రశ్నించారు. బొమ్మలరామారం మండలంలోని మూడుచింతలపల్లి నుంచి వడపర్తి వరకు డబుల్ రోడ్డు నిర్మిస్తామన్నారు. 2001 నుంచి గొంగిడి సునీత ఉద్యమ నేత సీఎం కేసీఆర్ వెంట నడిచిందన్నారు. ఇలాంటి నాయకురాలికి ఆలేరు ప్రజలు రెండుసార్లు అండగా నిలిచారని, మరోసారి గెలిపించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

### 28న రైతుబంధు నగదు జమ..

రైతులకు రైతుబంధు ఇచ్చి దుబారా చేస్తున్నారని రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటున్నారని, రైతులను బిచ్చగాళ్లుగా మారుస్తున్నారని వక్రీకరించినట్లు ఆరోపించారు. 24 గంటల కరెంటు వద్దు.. 3 గంటలు సాలు అంటున్నారు. ఇలాంటి కాంగ్రెస్ పార్టీకి పొరపాటున ఓటేస్తే కరెంటు కష్టాలు తప్పవని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. రైతుబంధు ఆపాలని కాంగ్రెస్ పార్టీ ఈసీకి ఫిర్యాదు చేసిందన్నారు. కానీ, ధర్మం గెలిచిందని, రైతుబంధు పంపిణీకి ఈసీ అనుమతి ఇచ్చిందన్నారు. నేడు, రేపు బ్యాంకులకు సెలవులని మంగళవారం ఉదయం నుంచి రైతు ఖాతాల్లో రైతుబంధు నగదు జమ చేస్తామని చెప్పారు. ఒక్క చాన్స్ అంటున్న కాంగ్రెస్‌కు అవకాశమిస్తే ఆగం కావడం ఖాయమన్నారు. తెచ్చుకున్న తెలంగాణ కేసీఆర్ చేతిలో ఉంటేనే సురక్షితమని చెప్పారు. రిస్క్ వద్దు.. కారు ముద్దు అని, ఎన్నో మంచి పనులు చేసిన కేసీఆర్‌ను సాదుకుందామా? చంపుకుందామా? ప్రజలు తేల్చుకోవాలన్నారు.

### చీకడిమామిడి గులాబీమయం

చీకటిమామిడి గ్రామంలో రోడ్ షో నిర్వహించిన మంత్రి హరీశ్‌రావుకు మహిళలు బొట్లు పెట్టి మంగళహారతులతో స్వాగతం పలికారు. జనం పెద్ద సంఖ్యలో రావడంతో ప్రధాన కూడళ్లు కిక్కిరిసిపోయాయి. గ్రామంలోని అన్ని విధులు గులాబీమయంగా మారిపోయాయి. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, నాయకులు సూదగాని హరిశంకర్ గౌడ్, వెంకటేశ్ గౌడ్ పాల్గొన్నారు.



బొమ్మలరామారం మండలం చీకటిమామిడి రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన ఆలేరు అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, చిత్రంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్



చీకటిమామిడిలో మంత్రి హరీశ్‌రావు ప్రసంగం వింటున్న జనం

### మరోసారి గెలిపించండి.. మరింత అభివృద్ధి చేస్తా

- బీఆర్‌ఎస్ ఆలేరు అభ్యర్థి, ప్రభుత్వ విప్ సునీతామహేందర్‌రెడ్డి

బొమ్మలరామారం, నవంబర్ 25 : రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మరోసారి గెలిపించండి.. మరింత అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చీకటిమామిడి గ్రామంలో మంత్రి హరీశ్‌రావుతో కలిసి శనివారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కాగానే మ్యానిఫెస్టోలో ప్రకటించిన ప్రతి హామీని నెరవేరుస్తామని చెప్పారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవని, మరింత అభివృద్ధి కావాలంటే బీఆర్‌ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# పైళ్ల గెలుపుతోనే మరింత ప్రగతి

- కాంగ్రెస్ కావాల్నా..? కరెంట్ కావాల్నా ప్రజలే తేల్చుకోవాలి
- భువనగిరి రోడ్ షోలో మంత్రి హరీశ్‌రావు
- దమ్మున్న నేత శేఖర్ రెడ్డి : మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

యాదాద్రి భువనగిరి, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : 'కాంగ్రెస్ వస్తే కటిక చీకట్లే.. దొంగలా కరెంట్ వస్తుంది. కాలిపోయిన మోటర్లు వస్తాయి. అద్దమరాత్రి పొలాల వద్ద పడిగాపులు గాయాలి.. దొంగోడి కరెంట్‌తో ఎవుసం ఎట్ల చేస్తం..? రిస్క్ వద్దు కారుకు గుద్దు' అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. శనివారం భువనగిరి పట్టణంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ నేతలు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని అంటున్నారని, 11 సార్లు గెలిస్తే ఏం చేశారని ప్రశ్నించారు. కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేదని, మళ్లీ ఏముఖం పెట్టుకుని ఓట్లడుగుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు 24గంటల కరెంట్ వద్దని, 3 గంటల విద్యుత్ చాలని అంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ నేతలు ఉత్తమ్ కుమార్‌రెడ్డి రైతుబంధు దుబారా అంటున్నారని, రేవంత్‌రెడ్డి రైతులను బిచ్చగాళ్లుగా పోలుస్తున్నారని, ఇలాంటి పార్టీ అవసరమా అని దుయ్యబట్టారు. కర్ణాటకలో గెలిపిస్తే రాష్ట్రాన్ని ఆగమాగం చేస్తున్నారని, కనీసం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ రైతులకు 11సార్లు రైతుబంధు సాయం అందిస్తే, కాంగ్రెస్ కనీసం 11 పైసలు కూడా ఇవ్వలేదన్నారు. రైతులకు రూ.73వేల కోట్ల రైతుబంధు సాయం అందిందని వివరించారు. ఈ నెల 28న అందరికీ రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. కాంగ్రెస్‌ను నమ్మొద్దని, ఆ పార్టీని నమ్మితే కర్ణాటకలో మోసం చేసిందని, తెలంగాణను కూడా మోసం చేస్తుందని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మన కన్నును మనమే పొడుచుకున్నట్లు అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీది సుతి లేని సంసారం అని, వాళ్లకు వాళ్లే కొట్లాటలు పెట్టుకుంటారని చెప్పారు. ఢిల్లీ పార్టీలకు గులాంగిరీ చేద్దామా..? మన పార్టీని కాపాడుకుందామా..? కాంగ్రెస్ కావాల్నా..? కరెంట్ కావాల్నా? అనేది ప్రజలే తేల్చుకోవాలని, కరెంట్ కావాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

### భువనగిరికి ఐటీ టవర్..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు మెడికల్ కాలేజీలు మంజూరయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లాను ఫ్లోరైడ్ రక్కసి వెంటాడిందని, కేసీఆర్ వచ్చాక ఫ్లోరైడ్‌ను పారదోలారని గుర్తుచేశారు. భువనగిరి ప్రాంతంలో ఐటీ, ఇండస్ట్రియల్ పరిశ్రమలు తీసుకొస్తామని, భువనగిరిలో ఐటీ టవర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వీటితో వేలాది మందికి ఉపాధి కలుగుతుందన్నారు.



భువనగిరి రోడ్‌షోలో కళాకారుల విన్యాసాలు



భువనగిరి రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన బీఆర్‌ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి, చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

### శేఖర్‌రెడ్డిని గెలిపిస్తే ప్రమోషన్..

'పైళ్ల శేఖర్‌రెడ్డి మంచోడు. ఉత్తమ ఎమ్మెల్యే. చీమకు కూడా హాని చేయని వ్యక్తి. ఎక్కడో వ్యాపారాలు చేస్తూ.. ఇక్కడ ఖర్చు పెడుతున్నరు. మూడోసారి గెలిస్తే ప్రమోషన్ వస్తుంది. అనుభవం కూడా వస్తుంది. శేఖర్‌రెడ్డికి ప్రమోషన్ వస్తే.. భువనగిరికి వచ్చినట్లే. కాంగ్రోసోడు గెలిస్తే ఏం వస్తుంది..? శేఖర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి.' అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. పైళ్ల శేఖర్‌రెడ్డి దమ్మున్న నేత అని, ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణా రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, అమరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

### అన్ని రంగాల్లో భువనగిరి అభివృద్ధి : ఎమ్మెల్యే పైళ్ల

భువనగిరికి మంత్రి హరీశ్‌రావు రావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. పోయినసారి కూడా ఇదే ప్రాంతంలో హరీశ్‌రావు ప్రచారం చేశారని, అప్పుడు కూడా గెలిచానని చెప్పారు. భువనగిరి నియోజకవర్గాన్ని, ముఖ్యంగా భువనగిరి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. కేసీఆర్ మూడోసారి సీఎం కానున్నట్లు చెప్పారు. హరీశ్ రావు మరోసారి మంత్రి అయ్యాక భువనగిరిని అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరారు.

